క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం నరాల, గుండెజబ్బుల వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

వీరపునాయునిపల్లె : మండలంలోని తంగెడుపల్లె పంచాయతీలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన బుట్టలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచు గొట్టిపాటి స్వర్ణలత తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి

జమ్మలమడుగు : భారతదేశ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహిత అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నెహ్రూ మెచ్చిన నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లింగాల ఎస్ఐగా మధుసూదన్‌రావు



లింగాల : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ మధుసూదన్‌రావు బాధ్యతలను చేపట్టారు. ఒంటిమిట్ట నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వేంపల్లె ఎస్ఐగా తిరుపాల్‌నాయక్



వేంపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా తిరుపాల్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని, సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులను అందజేస్తున్న పూర్వపు విద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వపు విద్యార్థులు మనోహర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, గంగిరెడ్డి, ఆనందరెడ్డి, రాములు శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. 10వ తరగతిలో 500 మార్కులు పైబడిన 16 మంది విద్యార్థులకు రూ.1000లు, 550 మార్కులు పైబడి సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.5000లు చొప్పున ప్రోత్సాహక బహుమతులను కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.10 నాణేల వినియోగంపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రూ. 10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. గురువారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో కెనరా బ్యాంకు ఎదుట రూ. 10 నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బీఐ ప్రకటించిందన్నారు. ఈ నాణెం చెల్లదంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మరాదని ఆయన సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దనమ్ మాట్లాడుతూ రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, వాటిని విరివిరిగా వాడాలన్నారు. రూ. 10 నాణేలను అన్నిరకాల లావాదేవీల్లోనూ ఉపయోగించవచ్చన్నారు.

వర్షాలు లేక.. అడుగంటుతున్న భూగర్భ జలాలు

- పీబీసీ కాలువ ద్వారా అందని తాగునీరు
- వర్షాలు లేక ఎండుతున్న పంట పొలాలు
- నీటిని విడుదల చేసి ఆదుకోవాలని వినతి

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ నుంచి ఆసించిన వర్షాలు లేక రెండు నెలలుగా చెరువులతో పాటు వాగులు, వంకలు ఎండిపోయాయి. దీంతో వ్యవసాయ బోర్లలో, బావులలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. సాగులో ఉన్న పంటలకు సాగు నీరు అందించడం రైతులకు గగనమవుతోంది. సాగునీరు అందించకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నీరులేక ఎండిపోయిన చెరువు



నీరు లేక బోసిపోయిన పీబీసీ కాలువ

వేముల : తీవ్ర వర్షాభావంతో నీరు లేక చెరువులు, పంటులు ఎండుతున్నాయి. పీబీసీ కాలువల ద్వారా సాగునీరు అందక పంటలు కాపాడుకునే పరిస్థితి లేకపోయింది. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాధారం కింద రైతులు విరివిగా పంటలు సాగుచేసుకున్నారు. పంటలు సాగు చేసి 60 రోజులు దాటినా వర్షం పడలేదు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయి. సాగు కోసం చేసిన పెట్టుబడులు గిట్టుబాటు అయ్యేలా చెరువులకు, పీబీసీ కాలువకు నీటిని విడుదలచేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

వ్యవసాయ బోర్ల కింద విరివిగా పంటల సాగు

ఈ ఏడు వ్యవసాయ బోర్ల కింద రైతులు విరివిగా పంటలను సాగు చేసుకున్నారు. పంటల సాగు సమయంలో బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరుండేది. బోర్లు, బావుల కింద చీనీ, నిమ్మ, అరటి, మిరప, వేరుశనగ, ఉల్లి, తదితర పంటలు సాగయ్యాయి. వర్షాలు లేక పంటలకు సాగు నీరు అందించే సమయంలో భూగర్భజలాలు అడుగంటడంతో రైతులు జీర్ణించుకోలేక పోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వరుణుడు మొహం చాటేశాడు. పంటలు సాగు చేసి 60 రోజులు దాటినా ఇప్పటికీ వర్షాల జాడ లేదు. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కకుండానే కొంత మంది రైతులు పంటలను దున్నివేస్తున్నారు.

పీబీసీ కాలువ ద్వారా అందని సాగునీరు

ఈ ఏడు పులివెందుల బ్రాంచి కెనాల్ ద్వారా పంటలకు సాగునీరు అందలేదు. పీబీసీ కాలువలతో పాటు ఉప కాలువల ద్వారా గతంలో సాగునీరు అందేది. గత ఏడాది వర్షాభావం నెలకొన్న కాలువల ద్వారా సాగునీరు అందటంతో పంటలను కాపాడుకున్నారు. అయితే ఈ ఏడు సీజన్ ముగుస్తున్నా పంటలకు సాగు నీరు ఇవ్వడం లేదు. అరకొర వర్షాలకు పంటలు సాగుచేస్తున్నా అనంతరం వర్షాలు లేక పంటలు దెబ్బతిన్నాయి. సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. పీబీసీ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసి ఉంటే ఇంజన్లు, మోటార్లు, ట్రాక్టర్ల ద్వారా సాగునీరు అందించి ఎండిన పంటలను కాపాడుకునేవారు. పంటలు ఎండిపోతున్నా సాగునీరు లేక పంటలను వదులుకుంటున్నారు.

వారం రోజుల్లో నీటిని విడుదల చేస్తాం



వారం రోజుల్లో పీబీసీ కాలువకు నీటిని విడుదల చేస్తాం. చిత్రావతి వద్ద గేట్ల మరమ్మతుల కారణంగా నీటిని విడుదల చేయలేకపోయాం. గండికోట నుంచి ఎత్తిపోతల ద్వారా సీబీఆర్‌కు నీటిని నింపుతున్నాం. పీబీసీ కాలువలకు, ఉప కాలువలకు త్వరలోనే విడుదల చేస్తాం. రైతులకు ఎంత మేర అవసరమో అంతమేర సాగునీటిని అందజేస్తాం.

– పీబీసీ ఈఈ, రాజశేఖర్, పులివెందుల

బోర్లలో నీరు అడుగంటిపోతున్నాయి



వర్షాభావంతో చెరువులు ఎండిపోయాయి. వ్యవసాయ బోర్లు, బావులలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీర్ఘకాలిక పంటలకు సకాలంలో నీరు అందించలేక ఉన్నాం. చెరువులను నీటితో నింపి వ్యవసాయ బోర్లు, బావులలో భూగర్భజలాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రామిరెడ్డి, చీనీ రైతులు, గొందిపల్లి

వర్షాభావంతో పంటలు ఎండుతున్నాయి



వర్షాభావం నెలకొనడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఎండుతున్నాయి. వర్షాధారం కింద మినుము, పత్తి పంటలను సాగు చేశాం. ఇప్పటికే కొంత మంది రైతులు ఎండిన పంటలను దున్నివేశారు. సాగునీరు ఇచ్చి కాపాడుకుందామంటే కాలువలకు నీరు రావడం లేదు. సకాలంలో కాలువలకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

–చలపతి, రైతు, వేముల

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట



దేవాలయంలో ప్రతిష్టించిన ధ్వజస్తంభం

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్టను నిర్వాహకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు దేవాలయంలో అర్చకులు పూజల అనంతరం ధ్వజస్తంభంకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో...



తొండూరు : మండలంలోని మడూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు.

వరాలు కురిపించు.. వరలక్ష్మీమాత

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
- ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు



పులివెందుల : అంకాలమ్మ ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



గాజులతో అలంకరించిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

పులివెందుల టౌన్ : వరాలు కురిపించు వరలక్ష్మీ మాత అంటూ ఆలయాలలో, తమ ఇళ్లలో మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముద్దనూరు రోడ్డు సమీపంలోని స్థానిక శ్రీచక్రసహిత మహాలక్ష్మి ఆలయంలో ఆలయ వార్షికోత్సవ సందర్భంగా అర్చకులు రామ్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరలక్ష్మి వ్రతము చేయడం వల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తూ కథను చదివి వినిపించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి, శ్రీఅంకాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అమ్మవారిశాల ఆలయాల్లో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరికి విశేషంగా గాజులతో అలంకరణ, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : శ్రావణమాసంలో శుక్లపక్షంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతంగా జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని భానుకోట శైవక్షేత్రంలో సురేష్‌శర్మ, బద్రీ శర్మలు మహిళా మూర్తులచే సామూహిక వరలక్ష్మి వ్రతంతో పాటు కుంకుమ అర్చన తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ఆలయ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేసి క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పొలతలలో ఘనంగా వరలక్ష్మి వత్రం

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శ్రీనువాసులు సమక్ష్యంలో ఘనంగా వరలక్ష్మి వత్రం వేడుకలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వెయ్యినూతలకోన క్షేత్రంలో వరలక్ష్మి వత్రం సందర్భంగా లక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవిఅమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ తెలిపారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని మహిళలు పూజలు నిర్వహించారు. భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



సింహాద్రిపురంలో పూజలందుకుంటున్న స్వామివారు



వ్రతం ఆచరిస్తున్న మహిళలు



పొలతలలో వరలక్ష్మి వత్రంకు హజరైన మహిళా భక్తులు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రైతుల బెంబేలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం చోరీకి గురవుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని మండల రైతులు వాపోతున్నారు. ఇటీవల శేషయ్యగారిపల్లి, ఖాదర్‌ఖాన్ కోట్టాలు, గోపవరం తదితర ప్రాంతాల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ముగ్గురు రైతుల పాత ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఖాదర్‌ఖాన్ కొట్టాల దగ్గర సమీప చెరువులో ట్రాన్స్‌ఫార్మర్ పడేసి ఆయిల్ కింద పోసి కాపర్ వైర్‌ను దొంగలించారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మరలో 10 నుంచి 12 కేజీల కాపర్ వైర్ ఉంటుందని వాటి విలువ పదివేల రూపాయలు ఉంటుంది. ఆయా విషయాలపై ఏఈ రామలింగారెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్న మాట వాస్తవమేనని, అయితే రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో శ్లోకా స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ బండి నవనీశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీడీఓ దివిజ సంపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో ఐదు మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థానాల్లో నిలపడమే లక్ష్యమన్నారు.

స్వామి వివేకానంద హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

స్వామి వివేకానంద హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ దివిజ సంపతి ఆధ్వర్యంలో జరిగిన పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కై వసం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్. భానుశ్రీ, జాహ్నవిగంగా, తనుశ్రీ గంగా ప్రనూషలు ఎంపీడీఓ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్లు పొందారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

శ్రీశైలం నీటిని జిల్లాలోని ప్రాజెక్టుల్లో నింపాలి

ఎర్రగుంట్ల : శ్రీశైలం జలాశయంలోని నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా పూర్తి సామర్థ్యంతో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులన్నీ పూర్తిగా అడుగంటిపోయాయన్నారు. శ్రీశైలం డ్యాం, నాగర్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలన్నీ నిండుకుండాల మారి లక్షల క్యూసెక్కులు నీరు సముద్ర పాలవుతుందన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు బ్రహ్మంసాగర్, గండికోట, పైడిపాలెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మైలవరం ప్రాజెక్టులన్నీ నీళ్లు లేక వెలవెల పోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, ఏఐఎస్ఎఫ్ నాయకులు శరత్, రైతు సంఘం నాయకులు మహానందిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి

నేడు విద్యుత్ అంతరాయం

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాజాబాబు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి సహకరించండి



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న సచివాలయ ఉద్యోగులు

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో దుకాణ యజమానులు ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి సహకరించాలని శానిటేషన్ అధికారి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న దుకాణాలపై ఆయన దాడులు చేసి మాట్లాడారు. చాలా దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించామన్నారు. దాడుల్లో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందించాలి

కడప స్పోర్ట్స్: క్రీడల అభివృద్ధి కోసం ప్రతి పాఠశాలకు క్రీడాసామగ్రిని అందజేయాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్‌టీసీ అతిథిగృహంలో రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడామంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని కలిసి విన్నవించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలకు క్రీడాసామగ్రిని పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం బాధ్యు లు నరసింహారెడ్డి, అన్నమయ్య జిల్లా బాధ్యు లు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

సింహాద్రిపురం : స్థానిక వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టకు సంబంధించి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, అర్చకులు తెలిపారు. ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా ఎండోమెంట్ ద్వారా రూ.కోటి నిధులు, దాతల సాయంతో రూ.50 లక్షల నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. శనివారం గోపూజ, వాస్తుహోమం, ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట, స్వామి వారి గ్రామోత్సవం, చెక్కభజనలు, 19వ తేదీ సోమవారం ఉదయం 4.40 గంటల నుంచి యంత్రప్రతిష్ట, స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలన్నారు.



వేణుగోపాల స్వామి నూతన ఆలయం

దాతల సహకారం మరువలేనిది

వీరపునాయునిపల్లె : స్థానిక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు దాతలు అందించిన సహకారం మరువలేనిదని పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొంతకాలంగా తాగు నీటి సమస్య ఉండటంతో కాలనీ వాసులు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన పిచ్చిరెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ వెల్‌ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో షాజిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో బోరు వెయించారు. మండలంలో ఏ గ్రామంలో నూతనంగా బోరువేసినా దెబ్బతిన్న బోర్లు ఉన్నా మా సొసైటీ ఆధ్వర్యంలో సామగ్రిని అందజేస్తామన్నారు.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు

పులివెందులలో వరుస చోరీలు

పులివెందుల రూరల్ : పట్టణంలో వారం రోజులుగా నాలుగు చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 10 రోజుల క్రితం చెన్నారెడ్డి కాలనీలోని ఓ ఇంటిలో దొంగలు బంగారు, నగదును అపహరించారు. పాత బస్టాండు సమీపంలోని కూల్‌డ్రింక్ షాపులో తలుపులు పగులగొట్టి రూ.50 వేలు విలువ గల కూల్‌డ్రింక్స్‌ను తీసుకెళ్లారు. మూడు రోజుల క్రితం కదిరి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సుమారు రూ.4.50 లక్షలు అపహరించారు. 5 రోజుల క్రితం గాయత్రినగర్ కాలనీలో నివాసముంటున్న మణికుమార్‌రెడ్డి ఇంటిలో రూ.లక్ష నగదుతో పాటు 5 తులాల బంగారు, సుమారు రూ.20 లక్షలు విలువ చేసే బాండ్లను అపహరించారు. వరుసగా పట్టణంలో చోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. సంబంధిత పోలీసుశాఖ అధికారులు చోరీలు జరగకుండా రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గాయత్రి కాలనీలో పగులగొట్టిన బీరువా (ఫైల్)